# నిష్పక్షపాతంగా ఎన్నికలు

- మూడు నియోజకవర్గాలకు 987 ఈవీఎంలు, 1107 వీవీప్యాట్‌లు
- జిల్లా ఎన్నికల అధికారి పీ ప్రావీణ్య



వరంగల్ కలెక్టరేట్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ పీ ప్రావీణ్య

ఖిలావరంగల్, అక్టోబర్ 20: మానవ ప్రమేయం లేకుండా స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించడమే ర్యాండమైజేషన్ ధ్యేయమని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పీ ప్రావీణ్య అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో అసెంబ్లీ ఎన్నికల కోసం ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల( ఈవీఎంలు) మొదటిదశ ర్యాండమైజేషన్‌ను రిటర్నింగ్ అధికారులు శుక్రవారం రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలోని మూడు అసెంబ్లీ నియోజకవర్గాల బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్, వీవీప్యాట్‌ల కేటాయింపు కోసం మొదటిదశ ర్యాండమైజేషన్ జరిగిందన్నారు. జిల్లాలోని మూడు అసెంబ్లీ సెగ్మెంట్లకు 987 ఈవీఎంలు, 1107 వీవీప్యాట్‌లను కేటాయించినట్లు తెలిపారు. ఇందులో నర్సంపేట నియోజకవర్గానికి 353 ఈవీఎంలు, 396 వీవీ ప్యాట్లు, వరంగల్ తూర్పునకు 287 ఈవీఎంలు, 322 వీవీ ప్యాట్లు, వర్ధన్నపేటకు 347 ఈవీఎంలు, 389 వీవీప్యాట్లు కేటాయించామన్నారు. ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌తో ర్యాండమైజేషన్‌ను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ర్యాండమైజేషన్ తర్వాత శనివారం ఉదయం నుంచి ఎనుమాముల మార్కెట్ యార్డ్‌లో ఉన్న ఈవీఎంలను ఆయా నియోజకవర్గాల్లోని ప్రత్యేక స్ట్రాంగ్ రూమ్‌లకు తరలించి, వాటిని పటిష్టమైన భద్రత, రక్షణలో ఉంచుతామన్నారు. పోలింగ్ కేంద్రాలకు ఈవీఎంల కేటాయింపు కోసం రానున్న కాలంలో మరింత ర్యాండమైజేషన్ చేస్తామన్నారు. సమావేశంలో వరంగల్ తూర్పు, నర్సంపేట, వర్ధన్నపేట ఆర్వోలో షేక్ రిజ్వాన్‌భాషా, అశ్వినితానాజీ, కృష్ణవేణి, ఆర్డీవో వాసుచంద్ర, నాయకులు పాల్గొన్నారు.

**పౌరుడి చేతిలో బ్రహ్మాస్త్రం.. సీ విజిల్ యాప్**

ఎన్నికల కోడ్ ఉల్లంఘనలో సీ విజిల్ మొబైల్ యాప్‌ను పౌరులు బ్రహ్మాస్త్రంగా ఉపయోగించుకోవచ్చని కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. కలెక్టరేట్‌లో సీ విజిల్ యాప్, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ ఉల్లంఘన, టోల్‌ఫ్రీ నంబర్ వాల్ పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం ఈ యాప్‌ను ఆధునీకరించి ఫ్లయింగ్ స్క్వాడ్‌తో అనుసంధానం చేశామన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు ఫిర్యాదులు యాప్‌లో అప్లోడ్ చేస్తే 100 నిమిషాల వ్యవధిలో దర్యాప్తు పూర్తి చేస్తారన్నారు. సీ విజిల్ యాప్ ద్వారా ఇప్పటి వరకు 16 ఫిర్యాదులు అందాయన్నారు. యాప్‌పై ప్రజల్లో మరింత ప్రాచుర్యం కల్పించాలని కలెక్టర్ సూచించారు. ప్రశాంత, పారదర్శక ఎన్నికలే లక్ష్యంగా కమిషన్ ఆదేశాలను పాటిస్తూ ప్రశాంతమైన వాతావరణంలో నిర్వహించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజలు తమ ఓటుహక్కును డబ్బు, మద్యం అక్రమ బట్వాడా, ప్రవర్తన నియమావళి ఉల్లంఘన కిందికి వస్తాయన్నారు. స్వేచ్ఛ, నిష్పాక్షపాతంగా ఎన్నికలు జరగాలంటే ఓటరులో చైతన్యం రావాలన్నారు. కార్యక్రమంలో వర్ధన్నపేట, నర్సంపేట, వరంగల్ తూర్పు నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు అశ్విని తానాజీ వాకాడే, కృష్ణవేణి, రిజ్వాన్‌భాషా, ఆర్డీవో వాసుచంద్ర, స్వీప్ జిల్లా నోడల్ అధికారి నర్సింహమూర్తి, విశ్వనారాయణ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే నరేందర్‌కు విరాళం అందజేస్తున్న అల్తాఫ్ హుస్సేన్

## ఎన్నికల ఖర్చు కోసం బాలుడి విరాళం

ఖిలావరంగల్, అక్టోబర్ 20: వచ్చే అసెంబ్లీ ఎన్నికల ఖర్చు కోసం ఓ బాలుడు పెద్ద మనస్సుతో బీఆర్ఎస్ అభ్యర్థి నన్నపునేని నరేందర్‌కు ఆర్థిక సాయం అందించాడు. శంభునిపేటకు చెందిన తెలంగాణ ఉద్యమకారుడు ఎండీ వహీద్ కుమారుడు అల్తాఫ్ హుస్సేన్ నాలుగేళ్లుగా తన కుటుంబ సభ్యులు ఇచ్చిన డబ్బులను కిడ్డీ బ్యాంక్‌లో దాచుకున్నాడు. గురువారం రాత్రి శంభునిపేటలోని ఓ మసీదులో ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ మత పెద్దలతో సమావేశమయ్యాడు. ఈ మేరకు నన్నపునేనికి వారు మద్దతు ప్రకటించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ క్రమంలో అల్తాఫ్ హుస్సేన్ తన తండ్రితో కలిసి మసీదుకు వచ్చి తాను దాచుకున్న రూ. 10 వేలను ఎన్నికల ఖర్చు కోసం ఎమ్మెల్యేకు అందించడంతో నరేందర్ ఉద్వేగానికి లోనై బాలుడిని ఆలింగనం చేసుకొని అభినందించారు. కార్యక్రమంలో 35వ డివిజన్ కార్పొరేటర్ సోమిశెట్టి ప్రవీణ్, బీఆర్ఎస్‌కేవీ జిల్లా అధ్యక్షుడు బోగి సురేశ్, గిరిప్రసాద్‌నగర్ అధ్యక్షుడు ఉల్ఫత్ పాల్గొన్నారు.



హోమంలో పాల్గొన్న దంపతులు

## కాశీవిశ్వేశ్వరుడికి రుద్రాభిషేకం

కాశీబుగ్గ, అక్టోబర్ 20: కాశీవిశ్వేశ్వరాలయంలో శుక్రవారం విశ్వేశ్వరుడికి రుద్రాభిషేకం చేశారు. దేవీ శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా ఆరు హోమ గుండాలు ఏర్పాటు చేయగా 36 జంటలు పాల్గొన్నాయి. వేదమంత్రోచ్ఛారణలతో చండీహోమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి గౌరవ అధ్యక్షుడు, కార్పొరేటర్ గుండేటి నరేంద్రకుమార్, మాజీ కార్పొరేటర్ బయ్యాస్వామి, డాక్టర్ జగదీశ్వర్, పూజారులు పాల్గొన్నారు.

**పండుగ వేళ ఇళ్లు భద్రం..!**

పోచమ్మమైదాన్, అక్టోబర్ 20: సద్దుల బతుకమ్మ, దసరా పండుగ సందర్భంగా ఇండ్లకు తాళాలు వేసి, సొంత గ్రామాలకు వెళ్లే ప్రజలు భద్రంగా ఏర్పాటు చేసుకోవాలని మట్టెవాడ సీఐ ఎన్.వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో సూచించారు. పాఠశాలలకు సెలవులు ఉన్నందున చాలామంది తల్లిదండ్రులు పిల్లలు, కుటుంబ సభ్యులతో కలిసి బంధువుల ఇళ్లు, విహార యాత్రలకు వెళ్తుంటారన్నారు. అయితే, దొంగతనాలు జరిగే అవకాశం ఉన్నందున ఇంట్లో ఉన్న విలువైన వస్తువులు, బంగారం, డబ్బులను వెంట తీసుకెళ్లాలని, లేకుంటే బ్యాంకు లాకర్లలో దాచుకోవాలని కోరారు. సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, అవసరమైతే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

**'బతుకమ్మ' ఏర్పాట్లను వేగవంతం చేయాలి**

కాశీబుగ్గ, అక్టోబర్ 20: సద్దుల బతుకమ్మ సందర్భంగా బల్దియా ఆధ్వర్యంలో చేస్తున్న ఏర్పాట్లను కమిషనర్ షేక్ రిజ్వాన్ భాషా శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించి, తగిన సూచనలు చేశారు. ఈ సందర్భంగా చిన్నవడ్డేపల్లి చెరువు వద్ద ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు ఉండాలని, పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణతోపాటు బతుకమ్మ ఆడేందుకు వచ్చే మహిళలకు తాగునీటి వసతి, బారికెడ్ల ఏర్పాటు, లైటింగ్ సదుపాయం, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సీటీ ప్లానర్ వెంకన్న, కుడా ఈఈ భీమ్‌రావు, టౌన్‌ప్లానింగ్ అధికారి బషీర్ పాల్గొన్నారు.

# దుర్గామాతకు విశేష పూజలు



అమ్మవారికి హారతి ఇస్తున్న నన్నపునేని

పోచమ్మమైదాన్/ఖిలావరంగల్/వరంగల్‌చౌరస్తా/గిర్మాజీపేట, అక్టోబర్ 20: దేవీ శరన్నవరాత్రోత్సవాలు శుక్రవారం ఆరో రోజుకు చేరుకున్నాయి. శృంగేరి శంకరమఠంలో అమ్మవారు సరస్వతీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. ప్రధాన అర్చకుడు సంగమేశ్వరజోషి, అర్చకులు చంద్రశేఖరశర్మ, సోమశేఖరశర్మ, విశాల్‌శర్మ, వివేక్‌శర్మ ప్రత్యేక పూజలు చేశారు. పూజా కార్యక్రమాల్లో శ్రీశంకర సేవా సమితి సభ్యులు మదన్‌మోహన్, రామారావు, చకిలం నరసింహమూర్తి, బొడ్ల రవీంద్రనాథ్, రాజేంద్రప్రసాద్, భాస్కర్, సంధ్యారాణి, అరుంధతి, జగన్మోహన్‌శర్మ, రాజేశ్వరి పాల్గొన్నారు. అలాగే, కొత్తవాడలో విశ్వబ్రాహ్మణ పురోహితుడు నరేశ్‌చారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాలకు తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. అలాగే, సన్ షైన్ యూత్ అధ్యక్షుడు భాషకార్ల హరికృష్ణ ఆధ్వర్యంలో అమ్మవారికి పూజలు నిర్వహించి భక్తులకు అన్నదానం చేశారు. కాశీబుగ్గ తిలక్‌రోడ్డులోని దుర్గామాత యూత్ సుధాకర్, శివ, నవీన్, కృష్ణ, చింటు ఆధ్వర్యంలో, పోచమ్మమైదాన్ వద్ద ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, ఎల్‌బీనగర్‌లో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివనగర్‌లో ఎమ్మెల్యే నరేందర్ హాజరై పూజలు చేసి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. మట్టెవాడలోని వేణుగోపాలస్వామి ఆలయంలో వేడుకలు నిర్వహించారు. 32వ డివిజన్ బీఆర్‌నగర్‌లో అన్నదాన కార్యక్రమాన్ని కార్పొరేటర్ పల్లం పద్మ ప్రారంభించారు. స్టేషన్‌రోడ్‌లోని కాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానం(ఆకారపు వారి గుడి)లో మూల నక్షత్రం సందర్భంగా ఆలయ ప్రధానార్చకుడు లంకా శివకుమార్ అన్నపూర్ణా విశాలాక్షి అమ్మవారి విగ్రహాన్ని పుష్పాలతో సరస్వతీదేవిగా అలంకరించారు. రాత్రి 8 గంటలకు మంత్రపుష్పం అందించి చిన్నారులకు నోట్‌బుక్స్, పెన్నులు, స్వీట్లు పంపిణీ చేశారు. అలాగే, పెరికవాడలో దుర్గామాతకు భక్తులు విశేష పూజలు అందించారు. అలాగే, వరంగల్ దేశాయిపేట రోడ్డులోని కల్యాణ్‌నగర్‌లో వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో ఎమ్మెల్యే నరేందర్ పాల్గొన్నారు. కార్పొరేటర్లు సురేశ్‌కుమార్ జోషి, కావటి కవిత, 22వ డివిజన్ ఇన్‌చార్జి మావురపు విజయభాస్కర్‌రెడ్డి హాజరయ్యారు.



పెరికవాడలో పూజలు చేస్తున్న భక్తులు

## ఓటరు చైతన్యంపై అవగాహన కార్యక్రమం

కాశీబుగ్గ, అక్టోబర్ 20: వరంగల్ తూర్పు(106) నియోజవర్గ పరిధిలోని లక్ష్మీపురం సీఆర్‌పీలో మెప్మా ఆధ్వర్యంలో రిసోర్స్ పర్సన్స్ (ఆర్‌పీలు), ఓబీలకు సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్(స్వీప్)-2023పై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వీప్ జిల్లా నోడల్ అధికారి నర్సింహహామూర్తి మాట్లాడుతూ.. ఆర్‌పీలు, ఓబీలు ఎన్నికల నియామావళి, ప్రక్రియపై కనీస అవగాహన కలిగి ఉండాలన్నారు. క్షేత్రస్థాయిలో స్వయం సహాయక బృందాలకు ఆర్‌పీలు, ఓబీలు ఓటుహక్కుపై చైతన్యం కలిగిస్తూ, ఓటు ప్రాధాన్యంపై అవగాహన కల్పించి, ఎన్నికల ప్రక్రియలో పాల్గొనేలా ప్రోత్సహించాలని తెలిపారు. అనంతరం సీవోలు, ఆర్‌పీలు, ఓటరు ప్రతిజ్ఞ నిర్వహించారు. కార్యక్రమంలో నియోజకవర్గ నోడల్ అధికారి కోలా రాజేశ్‌కుమార్, టీఎంసీ రమేశ్, సీవోలు రమాదేవి, రజిత, రాజ్‌కుమార్, ఖలీద్ అలీ పాల్గొన్నారు.



ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

## బీఆర్ఎస్ గెలవాలని ముస్లింల ప్రార్థనలు

కరీమాబాద్, అక్టోబర్ 20: రాష్ట్రంలో మళ్లీ బీఆర్ఎస్ అధికారంలోకి రావాలని కోరుతూ తవక్కల్ వెల్ఫేర్ ట్రస్టు అధ్యక్షుడు ఎంఏ జబ్బార్ ఆధ్వర్యంలో శుక్రవారం దర్గా షరీఫ్ హజ్రత్ సయ్యద్ అబ్దుల్లా ఖాసిం షహీద్‌లో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అలాగే, ఏకశిలానగర్‌లోని దర్గాలో ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఎంఏ జబ్బార్ మాట్లాడుతూ రాష్ట్రంలో ముచ్చటగా మూడోసారి కేసీఆర్ ముఖ్యమంత్రి కానున్నారని ధీమా వ్యక్తం చేశారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలే బీఆర్ఎస్‌ను గెలిపిస్తామన్నారు. తూర్పులో నన్నపునేని నరేందర్ సైతం గెలవాలని ప్రార్థనలు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఈద్గా అధ్యక్షుడు ఎంఏ జబ్బార్, మాషుఖ్ అలీ, హసన్ అలీబేగ్, ఇబ్రహిం, సర్వర్, మోయిన్, దస్తగిరి, వహీద్, మాషుఖ్‌పాషా, యూసుఫ్ పాల్గొన్నారు.

## సమష్టిగా ఉత్సవాల నిర్వహణ

కరీమాబాద్, అక్టోబర్ 20 : ఉర్సు రంగలీలా మైదానంలో సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాలను సమష్టిగా నిర్వహిస్తున్నామని దసరా ఉత్సవ కమిటీ అధ్యక్షుడు నాగపురి సంజయ్‌బాబు తెలిపారు. కరీమాబాద్‌లోని నేతాజీ ఆదర్శ సంఘం భవనంలో శుక్రవారం దసరా ఉత్సవ సమితి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంజయ్‌బాబు మాట్లాడుతూ ఈ నెల 22న సద్దుల బతుకమ్మ, 23న రావణవధ కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో దాతల సహకారంతో భారీగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి మేడిది మధుసూదన్, కోశాధికారి మండ వెంకన్నగౌడ్, ఉత్సవ కన్వీనర్ వడ్నాల నరేందర్, ట్రస్టు అధ్యక్షుడు వంగరి కోటేశ్వర్, సహాయ కోశాధికారి వెలిదె శివమూర్తి, ఉపాధ్యక్షులు, కార్యనిర్వాహక కార్యదర్శులు, కార్యదర్శులు, ఆర్గనైజర్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సంజయ్‌బాబు